క్లుప్తంగా

వావిలాల ఉపసర్పంచ్‌గా కంకణాల స్వరూపరాణి

జమ్మికుంట: మండలంలోని వావిలాల ఉపసర్పంచ్‌గా కంకణాల స్వరూపరాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి, ఎంపీడీవో కల్పన సోమవారం తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ రజినీకర్‌పై వార్డు సభ్యులు అవిశ్వాసం పెట్టి తొలగించారు. నూతన ఉపసర్పంచ్ ఎన్నిక కోసం సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్రీలత ఆధ్వర్యంలో వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 12 మంది వార్డు సభ్యులకు 8మంది హాజరు కాగా కంకణాల స్వరూపరాణి ఉపసర్పంచ్‌గా పోటీలో ఉన్నారు. మిగతా సభ్యులు ఎవరు పోటీలో లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అధికారులు ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్‌రావు, కార్యదర్శి సాంబయ్య వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దేశాయిపల్లి ఉపసర్పంచ్‌గా..

వీణవంక: మండలంలోని దేశాయిపల్లి ఉపసర్పంచ్‌గా నల్ల తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత ఉపసర్పంచ్‌పై వార్డు సభ్యులు అవిశ్వాసం పెట్టడంతో ఎన్నిక అనివార్యమైంది. సోమవారంపంచాయతీ ఆవరణలో ఎన్నికల అధికారిగా ఎంపీడీవో శ్రీనివాస్ వ్యవహరించగా వార్డు సభ్యులు తిరుపతిరెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి నియామకత్రం అందించారు. పలువురు గ్రామస్తులు తిరుపతిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నల్ల సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

తైబజార్(అంగడి) వేలం రద్దు చేయాలని ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రేణుక

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో తైబజార్(అంగడి)వేలంలో నిబంధనలు పాటించకుండా అవకతవకలు, అవినీతికి పాల్పడ్డారని, వేలంలో కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై గతేడాది కంటే తక్కువకు వేలం ఖరారు చేశారని, ఆ వేలం రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్‌గౌడ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతేడాది రూ. 45 లక్షలకు తైబజార్ దక్కించుకున్నారని, ఈసారి రూ. 37.65 లక్షలు దాటకుండా కాంట్రాక్టర్లు సిండికేటుగా మారి మున్సిపల్ కార్యాలయంలో రహస్యంగా వేలం నిర్వహణ జరిగిందని అన్నారు. మున్సిపల్ ఆదాయానికి లక్షల్లో గండి పడుతుందని, గతంలో వేలం దక్కించుకున్న వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని, తక్కువకు వేలం వేసిన కాంట్రాక్టును రద్దు చేయాలని, బాధ్యులపై చర్యలు చేపట్టి, మున్సిపల్ ఆదాయం సమకూరేలా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి


మహాసభపై వీణవంకలో రజకులతో మాట్లాడుతున్న సంపత్

వీణవంక: రజకుల డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 30న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే రజక సంఘం ఆవిర్భావ దినోత్సవ మహాసభను విజయవంతం చేయాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రజకులకు ఐదు అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానికల ఎన్నికల్లో కూడా రిజర్వేషన్ కల్పించాలని, యాభై ఏళ్లు నిండిన రజకులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. సంఘాలను సమష్టి చేయడం కోసం ఓయూ రజక విద్యార్థులు జిల్లా కేంద్రాలలో చేపట్టే జనచైతన్య సభలకు తెలంగాణ రజక సంఘం పూర్తిగా మద్దతు ప్రకటిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలువ మల్లేశం, తిరుపతి, శంకర్, సమ్మయ్య ఉన్నారు.

కొమురయ్య సేవలు మరువలేనివి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


శంకరపట్నం: గొల్లపల్లిలో


జమ్మికుంట: నివాళి అర్పిస్తున్న నాయకులు

మానకొండూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య సేవలు మరువలేనివని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. కొమురయ్య జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని సుడా ఆఫీస్‌లో సోమవారం సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావుతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సర్పంచ్ పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ నెల్లి మురళీ, నాయకులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసన్, మధు, తదితరులున్నారు.

జమ్మికుంట: పట్టణంలోని కేవీకే చౌరస్తాలో కురుమ సంఘం, కులస్తుల ఆధ్వర్యంలో సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన యోధుడు అని కొనియాడారు. తొలి తెలంగాణ సాయుధ పోరాట యోధుడిగా చరిత్రకెక్కిన మహా మనిషి అని, సాయుధ పోరాటం ఎందరికో ఆదర్శంగా నిలిచిందన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కురుమ సంఘం నాయకులు, కులస్తులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు ఒగ్గు రమేష్, గౌడ శ్రీనివాస్, ఎగితే అశోక్,ఆరె శ్రీనివాస్, ఆరె కుమార్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని గొల్లపల్లి గ్రామ కురుమ సంఘం భవనంలో దొడ్డి కొమురయ్య జయంతి నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి సర్పంచ్ రజిత, కొమురయ్య, సమ్మయ్య, రవి, రాములు నివాళి అర్పించారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చంద్రశేఖర్, ఏఎస్సైలు మల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌లు నివాళి అర్పించారు.

రైల్వేగేట్ తెరిపించాలని వినతి


ఎంపీ బండి సంజయ్‌కుమార్‌తో గ్రామస్తులు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలోని ఎల్‌సీ నంబర్ 25/ఈ రైల్వే గేట్‌ను మరమ్మతుల కోసం మార్చి 12న మూసివేసిన అధికారులు తిరిగి తెరవడంలేదని దేశరాజ్‌పల్లి గ్రామస్తులు సోమవారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గేట్ మూసివేడయంతో పంట పొలాల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందని, పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, తక్షణం గేట్ తెరిచేలా కృషి చేయాలని విన్నవించారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఉప్పు రాంకిషన్, జాతరగొండ అయిలయ్య, ముట్టి మహేందర్, సాగర్, కనకయ్య, రాజేశం, ఆనందం, గట్టయ్య పలువురు పాల్గొన్నారు.

చెరువు శిఖంలో ఆలయం నిర్మించొద్దు


మాట్లాడుతున్న ఉదయ్, రవీందర్‌రెడ్డి

గన్నేరువరం: మాదాపూర్ గ్రామ చెరువు శిఖంలో రామాలయ నిర్మాణం చేపట్టకుండా సంబంధిత అధికారులు చెరువును కాపాడాలని అఖిలపక్షం నాయకులు సపంతి ఉదయ్, కొమ్మెర రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో మాట్లాడారు. కొందరు నాయకులు స్వార్థ రాజకీయాల కోసం ఆలయ నిర్మాణం చేపట్టడం సమంజసం కాదని, సంబంధిత వ్యక్తులపై అధికారులు కేసు పెట్టారని, భవిష్యత్ తరాలకు చెరువు ఎంతో ముఖ్యమని దీనిపై కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సైతం చెరువులో పురాతన విగ్రహాలు ఉన్నాయనడం దురదృష్టకరమన్నారు. పురాతన విగ్రహాలు లేవని, చెరువులోకి తరలించిన మట్టిని తొలగించే ప్రకియను అధికారులు చేపట్టాలని కోరారు. లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో గంగాధర తిరుపతి, మార్గం మల్లేశం, నూనె మల్లారెడ్డి, బాలయ్య, స్వామి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయించాలి

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల రైతులు పండించిన మొక్కజొన్నను నేరుగా హుస్నాబాద్ మార్కెట్ యార్డుకు తరలించాలని చిగురుమామిడికి చెందిన, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షురాలు రామోజు రజితకృష్ణమాచారి కోరారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. 3వ తేదీ నుంచే కొనుగోళ్లు ప్రారంభమయ్యారని, 30వ తేదీ వరకు కొనుగోళ్లు సాగుతాయన్నారు.

కుట్రపూరిత వైఖరి అవలంబించొద్దు


మాట్లాడుతున్న అంజన్‌కుమార్, తదితరులు

చొప్పదండి: ప్రధానితో అదానికి ఉన్న ఆర్థిక, వ్యాపార సంబంధాలను రాహుల్ గాంధీ బయట పెట్టినందుకే కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత వైఖరి అవలంబిస్తోందని పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ విమర్శించారు. చొప్పదండిలో సోమవారం మాట్లాడారు. అదాని వ్యవహారం తేలేంత వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు ను ఖండించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరును విమర్శించారు. సమావేశంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


సన్మానిస్తున్న నాయకులు, తదితరులు

సైదాపూర్: తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బావ్‌సింగ్‌ను సోమవారం ఎస్‌ఐ జన్ను ఆరోగ్యంతో పాటు మండలంలోని పలు పార్టీల నాయకులు సన్మానించారు. మండలంలో పేరుకుపోయిన రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజాసమస్యల పరిష్కారానికి, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెన్నంపల్లి సర్పంచ్ అబ్బిడి పద్మారవీందర్‌రెడ్డి, కూతురు విద్యాన్‌రెడ్డి, ముత్యాల వీరారెడ్డి, గున్నాల కృష్ణమూర్తి, కుమార్ రాజా, సుంకరి రవి, ఇమామ్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం

చొప్పదండి: చొప్పదండి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా మహేశుని మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా దూస రాము, కోశాధికారిగా రాజేశ్ పవార్ నియామకయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం అభినందించారు.

'పది' విద్యార్థులకు ఆటో సౌకర్యం


ఆటోను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

చొప్పదండి: మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎంపీటీసీ సింగిరెడ్డి క్రిష్టారెడ్డి ఆటో సౌకర్యం కల్పించారు. ఎండలు, దూరభారం, అందరికి ప్రయాణ సౌకర్యాలు లేక పోవడంతో ఆటో సమకూర్చామని ఎంపీటీసీ తెలిపారు. సోమవారం ఆటో ప్రారంభించారు. కార్యక్రమంలో సింగసాని కనకయ్య, ఎరుకల తిరుపతిగౌడ్, దీకొండ గంగయ్య, భూతగడ్డల ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామ సమస్యలపై ప్రజావాణిలో సోమవారం కట్ట కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు యువకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామం నుండి బోయినిపల్లి మండలానికి వెళ్లడానికి తడగొండ రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డు వర్షానికి గుంతలమయమైందని, రోడ్డును మరమ్మతు పనులు చేపట్టాలని, గ్రామం నుంచి తిప్పాయిపల్లి ద్వారా వేములవాడకు బస్సు పునరుద్ధరించాలని, గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రూ.4 కోట్లతో దశలవారీగా అభివృద్ధి పనులు


పనులు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ సిటీ: నగరంలో రూ.4 కోట్లతో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. సోమవారం 11వ డివిజన్‌లో పర్యటించి కార్పొరేటర్ ఆకుల నర్మదతో కలిసి రూ.25 లక్షల నిధులతో నిర్మించే ఎస్‌డబ్ల్యూజీ పైపులైన్, అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 11వ డివిజన్ కట్టరాంపూర్ ప్రాంతం కూడా శివారు ప్రాంతమమని, పేద ప్రజలు నివసిస్తున్నందున అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా స్టేడియం నుంచి గౌతమినగర్ సిరిసిల్ల బైపాస్ వరకు స్మార్ట్ రోడ్డు నిర్మించామన్నారు. శ్రీనగర్‌కాలనీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించామని తెలిపారు. కట్టరాంపూర్, ఫకీర్‌వాడలో రోడ్లు, డ్రైయినేజీ, మంచినీటి సరఫరా సమస్యలను కూడా పరిష్కరించామన్నారు. వాసుదేవకాలనీలో 40 ఫీట్ల ప్రధాన రోడ్డును, 3 రిజర్వాయర్ల పరిధిలోని డివిజన్లకు పైలెట్ ప్రాజెక్టు కింద 24గంటల నీటిసరఫరాను త్వరలోనే చేస్తామని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం నగరంలోని అన్ని డివిజన్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఓంప్రకాష్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


గంగాధర:పౌష్టికాహారం అందిస్తున్న సీడీపీవో


ఇల్లందకుంట రైతువేదికలో మిల్లెట్స్ ప్రదర్శన


గన్నేరువరంలో గర్భిణులకు సీమంతం

మానకొండూర్‌రూరల్: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు వివిధ రకాల చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు.

గన్నేరువరం: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో మాట్లాడారు. పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం చేశారు.

వీణవంక: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ ముసిపట్ల రేణుక, ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు.

ఇల్లందకుంట: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడా ముగింపు సభలో మాట్లాడారు.

హుజూరాబాద్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలని ఎంపీపీ ఇరుమల్ల రాణి అన్నారు. పట్టణంలోని సిటీ సెంటర్ ఫంక్షన్ హాల్‌లో పోషణ్ పక్వాడా ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు.

గంగాధర: పౌష్టికాహారం తీసుకుంటేనే బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని గంగాధర ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మధురానగర్ గ్రామపంచాయతీలో సమావేశం నిర్వహించారు.

రామడుగు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు చిరుధాన్యాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయప్రద, సుధారాణి అవగాహన కల్పించారు.

చొప్పదండి: మండల పరిషత్ సమావేశ మందిరంలో పోషణ పక్వాడా ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్ చిరుధాన్యాల ఆవశ్యకత వివరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్: మండలంలోని అన్నారంలో మాల సంఘం, లలితాపూర్‌లో మహిళా సంఘం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, శ్రీనివాసనగర్‌లో మహిళా సంఘం నూతన భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలోని 146 గ్రామాల్లో 87 మహిళా సంఘం భవనాలు పూర్తి చేసుకున్నామని, మిగతాచోట్ల త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. తెలంగాణ కోసం గాంధీలా తిరిగానన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్నామని, మహిళా సంఘ భవనాలను అమ్మ ఒడిలా భావించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్‌లు బొట్ల కిషన్, మర్రి కొండయ్య, కొట్టె నీలమ్మ, రొడ్డ పృథ్వీరాజ్, మాజీ సర్పంచ్ ఎరుకల భాగ్య నాయకులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ నెల్లి మురళి, స్వరూప, పడకంటి వీరేశం, రామస్వామి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, అనవేని రాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వాహనాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్‌ల సంఘం అధ్యక్షుడు సంతోష్, తదితరులు

చిగురుమామిడి: ముదిరాజ్‌ల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండలంలోని సుందరగిరి గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గందె సంతోష్ అన్నారు. సోమవారం సంఘం కార్యాలయం ఆవరణలో సంఘం సమావేశం నిర్వహించారు. అర్హులైన ముదిరాజ్‌లకు సబ్సిడీపై వాహనాలు అందాల్సి ఉందని, నేటికి రాకపోవడంతో నిరాశలో మగ్గుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు పెసరి శ్రీనివాస్, డైరెక్టర్లు ఎం. రమేశ్, సాదయ్య, శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు కాశవేని నర్సయ్య, సభ్యులు జి. సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. గత కోశాధికారి అనివార్య కారణాల వల్ల రాజీనామా చేయగా నూతనంగా పిట్టల తిరుపతిని కోశాధికారిగా ఎన్నుకున్నామని సంతోష్ తెలిపారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన


శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మల్లారెడ్డి

గన్నేరువరం: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. ఈసందర్భంగా మండలంలోని పీచుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిర కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం సందర్శించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పీచు చంద్రారెడ్డి, నాయకులు కాంతాల విక్రమ్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

మానకొండూర్: మానకొండూర్ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు జాలపెల్లి శ్రీనివాస్ గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను సోమవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. వెంట ఉపసర్పంచ్‌గా నెల్లి మురళి, ఎంపీటీసీ ఉండింటి సులోచనశ్యామ్సన్, కురుమ సంఘం అధ్యక్షుడు సీతాల తిరుపతి, బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుర్రం కిరణ్ గౌడ్, వార్డు మెంబర్ బిల్లవేణి రమేష్, కురుమ సంఘం సభ్యులు ఉన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్ 2005-06 పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



హుజూరాబాద్: పట్టణంలోని కరీంనగర్ రోడ్డు బోర్నపల్లి సమీపంలో మెకానిక్ ఫీల్డ్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్‌కు స్థలం కేటాయించడంపై సోమవారం అసోసియేషన్ బాధ్యులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఉపఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు స్థలం కేటాయించడం అభినందనీయమని తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ కనకయ్య

తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా రవాణాశాఖ, తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను డీటీసీ చంద్రశేఖర్‌గౌడ్, ఎమ్మార్వో కనకయ్య సోమవారం ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడారు. వేసవిలో కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చేవారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేశామని, వాహనదారులు, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ నాగలక్ష్మి, ఏఎంవీఐ రజని, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐ , సిబ్బంది గురు ప్రసాద్, లక్ష్మి నారాయణ, అశోక్, సురేష్, కల్పన, గంగాధర్, కరుణాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.